క్లుప్తంగా

10న మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్

నాదెండ్ల: ఈ నెల 10న మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. ప్రతి పాఠశాలలో ఉదయం జరిగే సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రుల హాజరుకావాలని కోరారు. చదువు, విద్యార్థి ప్రవర్తన, సామాజిక అంశాలు, మౌలిక వసతులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అదేరోజు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కానుకను పంపిణీ చేయనున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు నిర్వహించనున్నారు. అటవీ శాఖ అందించే మొక్కలను గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి రెండు మొక్కలు అందించి వారికి యిష్టమైన ప్రదేశాల్లో నాటి నాలుగేళ్లపాటూ అవి చెట్లయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అదేరోజు విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు.

పంట సాగుదారు హక్కు పత్రాలు తప్పనిసరి



ఏఓ ఆంజనేయులు

నూజెండ్ల: కౌలు సాగు చేసే రైతులందరూ పంట సాగు హక్కు పత్రాలు (సి.సి.ఆర్.సి) కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.ఆంజనేయులు అన్నారు. మండలంలోని తలార్లపల్లె, ములకలూరు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ ఆంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల వలన రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీపై పొందవచ్చన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసి పంటల బీమా, పెట్టుబడి రాయితీ,అన్నదాత సుఖీభవ తదితర పథకాలతో పాటు పండించిన పంటకు కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వి.రేవంత్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలు బాధ్యతగా పనిచేయాలి



నూజెండ్ల: ఇంటి ఆవరణలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పలపాడు, నూజెండ్ల గ్రామాల్లో అమలు అవుతున్న పారిశుద్ధ్య పనులు మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. క్లాప్ మిత్రలు చెత్తను సేకరిస్తున్నారా, లేదా అంటూ గ్రామస్తులను ఆరా తీశారు. రోడ్ల వెంట చెత్త దిబ్బలను తొలగించాలని సెక్రటరీలను ఆదేశించారు. మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఇంటి మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేస్తూ పూడిక రానీయకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఇవోఆర్డీ రబ్బాని, సెక్రటరీ ప్రభాకర్, సూరిబాబు ఉన్నారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే మద్యం కొనండి

నరసరావుపేట టౌన్: ప్రజలు కేవలం ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల ద్వారానే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైసెన్స్‌లేని అనధికారిక వ్యక్తుల వద్ద నుంచి మద్యం కొనుగోలుచేసి సేవించటం చాలా ప్రమాదకరమని, అది నకిలీ మద్యం కావొచ్చన్నారు. వివాహాలు, ఇతర పార్టీ, సామూహిక వేడుకలకు తాము తక్కువ ధరకే మద్యం సరఫరా చేస్తామంటూ కొందరు వ్యక్తులు మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసే మద్యం నకిలీదై ప్రాణాలకు ప్రమాదం తీసుకురావొచ్చన్నారు. అనుమానిత వ్యక్తుల వివరాలను 94409 02480 నంబర్‌కి తెలియచేయాలని కోరారు.

వాహన తనిఖీలు నిర్వహణ



చిలకలూరిపేట: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కె.గోపాల్ చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో బుధవారం మోటారు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 వాహనాలు తనిఖీ చేశారు. ఇందులో ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేనివి రెండు, యూనిఫాం ధరించలేదని ముగ్గురిపై, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేని మూడు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేనివి ఒకటి, పర్మిట్ లేనిది ఒకటి, డ్రైవింగ్ లైసెన్స్ లేనివి ఒకటి గుర్తించి రూ. 47,200 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ లైనుతో సమస్యకు చెక్

- నూజెండ్ల సబ్ స్టేషన్ పరిధిలో తీరనున్న విద్యుత్ సమస్య
- ఈదర విద్యుత్ ఉపకేంద్రం నుంచి నూతన లైను నిర్మాణం



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు



పనులు చేస్తున్న సిబ్బంది

నూజెండ్ల: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వినియోగదారుల విద్యుత్ అంతరాయ సమస్యలు తీరనున్నాయి. సంవత్సరాల కాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన ప్రత్యామ్నాయ విద్యుత్ లైను సౌకర్యం నూజెండ్ల సబ్ స్టేషన్‌కు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం నూజెండ్ల ఉప కేంద్రానికి వినుకొండ నుంచి ఏనుగుపాలెం ఫీడర్ ద్వారా 33 కె.వి. విద్యుత్ సరఫరా జరుగుతోంది. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేసి దశాబ్దాలు కాలం కావటంతో చిన్నపాటి గాలులకే స్తంభాలు విరిగిపోవటం, తీగలు తెగిపోవటం జరుగుతోంది. దీనివల్ల సరఫరా నిలిచిపోతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గత ప్రతిపాదనల మేరకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ మెరుగుదల కోసం కేంద్రం చర్యలు చేపట్టింది. ఉప కేంద్రాలను కలుపుతూ ప్రత్యామ్నాయ లైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండల పరిధిలోని ఈదర విద్యుత్ ఉప కేంద్రం నుంచి అప్పాపురం మీదుగా నూజెండ్లకు 12 మీటర్ల పొడవైన భారీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా నూజెండ్ల, దాని పరిధిలోని కొన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేసి తీగలు వేసే పనులు పూర్తి చేస్తున్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ అంతరాయం ఉండబోదని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇక నిరంతర విద్యుత్ సరఫరా

ప్రత్యామ్నాయ విద్యుత్ లైను ఏర్పాటు చేయడం ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరాను వినియోగదారులు పొందవచ్చన్నారు. రైతుల ఇబ్బందులు తొలుగుతాయన్నారు. నూజెండ్ల నుంచి మిగతా ఉప కేంద్రాలకు ఉపయుక్తంగా ఉంటుంది.

–సుధాకర్, ఏఈ

అంకితభావంతో పరిశోధనలు చేయాలి

కేఎల్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రొఫెసర్ జగన్నాథరావు

నరసరావుపేట రూరల్: విద్యార్థులు పరిశోధనల పట్ల అంకితభావంతో పనిచేయడం ద్వారా భవిష్యత్‌ను మరింత మెరుగుపర్చుకోవచ్చని కేఎల్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావు తెలిపారు. ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫైనల్ ఫిస్టా–2025 కార్యక్రమంలో జగన్నాథరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో అనేక రకాలైన ఫార్మా పరిశోధనలు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు ఆలోచనలు మలుచుకోవాలని సూచించారు. దీనివలన దేశ భవిష్యత్‌లో యువత ముఖ్యపాత్ర పోషించగలరని తెలిపారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలు, కలలకు అనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో విద్యనభ్యసించాలని తెలిపారు. నాల్గవ సంవత్సరం బి.ఫార్మసీ కోర్సును పూర్తి చేసుకుంటున్న ప్రతి విద్యార్థికి బహుళజాతి కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

11 మోటార్ బైక్‌లు స్వాధీనం



పట్టుబడిన వాహనాలు, వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ పి.రమేష్

చిలకలూరిపేట:మోటార్‌బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అర్బన్ సీఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పురుషోత్తమ పట్నంకు చెందిన పోలాసు ఉదయకిరణ్, సుగాలి కాలనీకి చెందిన బాణావతు జశ్వంత్ నాయక్, కోడావత్ బాలస్వామి నాయక్ చెడు వ్యసనాలకు బానిసై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పట్టణ ఎస్ఐ పి.హజరతయ్య ఎన్ఆర్‌టీ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీపై అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో వారు వివిధ ప్రాంతాల్లో దొంగిలించిన స్కూటీలు, బైక్‌లు కలిపి మొత్తం 11 ద్విచక్ర వాహనాలను ఎన్ఆర్‌టీ రోడ్డులోని చెట్ల పొదల మధ్య దాచి ఉంచగా వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ ఇంటి బయట ద్విచక్ర వాహనాలు నిలిపే వారు ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు డి.చెన్నకేశవులు, షేక్ రహమతుల్లా సిబ్బంది పాల్గొన్నారు.

సహకార రంగంతో సత్వరాభివృద్ధి

సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి



మాట్లాడుతున్న సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి

చిలకలూరిపేట: సహకార రంగం ద్వారానే సత్వర అభివృద్ధి, దేశ ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమౌతుందని సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి చెప్పారు. ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈనెల ఒకటి నుంచి ఆరో తేదీ వరకు సహకార ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని కొమరవల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో బుధవారం మోడల్ ఆడిటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చినరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయాల్లో అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మోడల్ ఆడిటింగ్, స్వచ్ఛత కార్యక్రమాలు, మెంబర్‌షిప్ డ్రైవ్, పాఠశాలల్లో సహకార సంఘాలపై అవగాహన కార్యక్రమాలు, సహకార సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొమరవల్లిపాడు ప్రాథమిక సహకార పరపతి సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం ఆర్థికంగా బలపడేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, సంఘ సీఈవో బండ్ల అశోక్, సూపర్‌వైజర్ ఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు సంఖ్య పెరగాలి



శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు సంఖ్య పెంపుదల జరిగేలా క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు బాధ్యత వహించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో యం.పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. నెలవారి జరిగే వైద్య ఆరోగ్య సేవలు ఆన్‌లైన్ నమోదు పారదర్శకంగా చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. పోట్లూరు గ్రామంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై ఎంఎల్‌హెచ్‌పీ ఆరోగ్య కార్యకర్తతో మాట్లాడి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, యూడీసీ బోడ్డుపల్లి అయ్యన్న, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి ఉన్నారు.

షేడ్‌నెట్ యజమానులు నిబంధనలు పాటించాలి



నాదెండ్ల: షేడ్‌నెట్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఐ.వెంకటరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో షేడ్‌నెట్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలైన మొక్కలు అందించాలని, ఐఎస్ఐ మార్క్ ఉన్న విత్తనాలను నాటి నారు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ధృవీకరణ లేనటువంటి విత్తనాలతో నారు ఉత్పత్తి చేసి రైతులకు అందించటం నేరమన్నారు. షేడ్‌నెట్ యజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఉద్యానవనశాఖ అధికారి ఆర్ శ్రీలక్ష్మీ, సహాయకులు వేదవతి ఉన్నారు.

పునర్జన్మనిచ్చేది వైద్యులే

చిలకలూరిపేటటౌన్: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, వైద్యులు దేవుడితో సమానమని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) సలహాదారులు, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో పలువురు వైద్యుల్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమాజానికి చేస్తున్న సేవలు అపారమని, వారిని గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గార్డ్స్‌సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, ప్రతినిధులు, న్యాయవాది ఇనగంటి శివనాగరాజు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు షేక్ బాజీ, నలమాల దానయ్య, వడ్లనా చంద్రం, కుల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డెంగీ సోకకుండా జాగ్రత్తలు పాటించాలి




నాదెండ్ల: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సాతులూరు పాల కేంద్రం వద్ద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమంతో పాటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశ్వేత మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, ఇంటి ఆవరణలో పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పగలు కుట్టే దోమలతో డెంగీ ప్రబలుతుందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఏడుకొండలు, మల్లేశ్వరి, రాధిక, రాజేశ్వరి, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా రాఘవయ్య



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాఘవయ్య ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ఈవోపీఆర్డీగా పనిచేసిన నిర్మలలక్ష్మీ కుమారి గతనెల 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం విదితమే. రాఘవయ్య సాతులూరు పంచాయతీ కార్యదర్శిగా, కనపర్రు, గొరిజవోలు ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

బీజేపీ కృపారావుకు మరో ఛాన్స్



నరసరావుపేట: పల్నాడు జిల్లా బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు వల్లెపు కృపారావు రెండో సారి ఎన్నికయ్యారు. వచ్చే మూడేళ్లపాటు ఈ పదవిలో ఉండనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు పలు గ్రామాలలో గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ, పాత సంతవీధి, కుమ్మరకాలనీ, ఎన్ఆర్‌టీ సెంటర్, కృష్ణారెడ్డిడొంక, డైక్‌మెన్ నగర్, రహమత్ నగర్, నెహ్రూ నగర్, వేలూరు డొంక, గుర్రాల చావిడి, శారదా హైస్కూల్ రోడ్డు, చీరాల రోడ్డు, పెదనందిపాడు రోడ్డులలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా చిలకలూరిపేట మండలంలోని మానుకొండవారిపాలెం, మిట్టపాలెం, గొట్టిపాడు, దండమూడి, నాగభైరువారిపాలెం, గుదేవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, పసుమర్రు, బొప్పూడి గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాదెండ్ల మండలంలోని గణపవరం నుంచి కావూరు రోడ్డు, అమీన్‌సాహెబ్‌పాలెం, కనపర్రు, ఇర్లపాడు, ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారి పాలెం, మైనంపాడు గ్రామాలలో సంబంధిత వేళల్లో గృహ, వాణిజ్య, వ్యవసాయ, పరిశ్రమలకు కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గణపవరం డొంక రోడ్డు సైడుకాల్వల మరమ్మతు



కాలువలు శుభ్రం చేయిస్తున్న మారుతిబాబు

నాదెండ్ల: గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్ళే డొంక రోడ్డుకు ఇరువైపులా మురుగునీరు పారుదల సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. గడిచిన రెండు రోజులుగా ఏఎంజీ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద నుండి కుప్పగంజివాగు వరకూ మురుగునీరు పారుదల సౌకర్యం కోసం పాత కాలువలను ప్రొక్లెయినర్‌తో మరమ్మతులు చేశారు. కాలువలపై ఉన్న వ్యర్థాలు తొలగించారు. షాపుల యజమానులు వేసి కల్వర్టులు, పైపులను తొలగించి కాలువ పూడికతీశారు. గత కొంతకాలంగా చిలకలూరిపేట పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మురుగునీరు ఈ కాలువల ద్వారా ప్రవహిస్తున్నారు. కాలువలు సరిగా లేక పోవటంతో మురుగునీరు రోడ్లపైకి చేరి వాహనదారులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. గతంలో మున్సిపాలిటీ అధికారులు ఒకవైపు కాలువలో పూడిక తీసినా ఫలితం లేదు. తీసిన సిల్టును రోడ్డుపైనే నిల్వ ఉంచటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిల్టు కారణంగా తారురోడ్డుపై బురద చేరి వాహనాల రాకపోకలకు సమస్యలు ఎదురౌతున్నాయి. తాజాగా పంచాయతీ అధికారులు రోడ్డుకు పడమర వైపున కాలువలో పూర్తిగా సిల్టు తొలగిస్తున్నారు. అధికారులు కచ్చా డ్రైన్ల స్థానంలో పక్కా డ్రైన్లు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీబాబును వివరణ కోరగా, కాలువల్లో నీరు పొంగి రోడ్డుపైకి చేరుతుండటంతో రెండు రోజులుగా శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు.

విత్తనాల రసీదులు తప్పనిసరిగా తీసుకోండి

రైతుకు ఏవో శ్రీలత సూచన



చందవరంలో మాట్లాడుతున్న ఏవో శ్రీలత



రొంపిచర్లలో మాట్లాడుతున్న శివలలిత

నాదెండ్ల: పంటల సాగులో విత్తనాల ఎంపిక ముఖ్యమని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసేసమయంలో రసీదులను పొంది భద్రపరచుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. మండలంలోని బుక్కాపురం, చందవరంలో గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్సుడు దుకాణాల్లోనే కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నకిలీ విత్తనాలు విక్రయిస్తారని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు పొందవచ్చన్నారు. గతేడాది పొగాకు సాగు చేసిన రైతులు పంటను అమ్ముకునే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయించుకున్న రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు విక్రయించుకోవచ్చన్నారు. ముందుగా రైతులు గ్రేడ్‌ల వారీగా విభజన చేసుకుని పొగాకు తరలించాలన్నారు. గ్రేడ్‌ల వారీగా రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీఏఏ కోటంరాజు ఉన్నారు.

కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డు తప్పనిసరి

రొంపిచర్ల: ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ కార్డులను తప్పనిసరిగా పొందాలని వ్యవసాయ అధికారి శివలలిత చెప్పారు. మండలంలోని రొంపిచర్ల, ఆరేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం ప్రభుత్వం వరి, కంది, మిర్చి పంటలకు కల్పించిన బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలకు కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది డి. శ్రీనివాసరావు, పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంపై రైతులకు మార్గదర్శనం

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ, వంకాయలపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు, సలహాలు అందించారు. పొగాకు కొనుగోలు ప్రక్రియలో తేమ శాతం 20% లోపు ఉండేలా బేళ్లను ఆరబెట్టుకోవాలని, సక్రమంగా గ్రేడింగ్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని సూచించారు. ముందుగా రైతు సేవా కేంద్రాల వద్ద సీఎంయాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ షెడ్యూలింగ్ తప్పనిసరిగా వస్తుందని, ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అయితే, ఇకపై రైతులు పొగాకు పంటను సాగు చేయవద్దని ఆయన స్పష్టం చేశారు.

సాగు రైతులు..

అలాగే ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ ఆధారిత దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేసి, దానికి సంబంధించిన ఓచర్‌లను తప్పనిసరిగా పొందాలని హరిప్రసాద్ సూచించారు. పంట వేసిన తర్వాత పంట నమోదు చేయించుకోవడం అత్యంత ముఖ్యమని, దీని ద్వారానే పంటకు మద్దతు ధర లభించి, పంట కొనుగోలు జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు జీవన్ నాయక్, ప్రసన్న కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయలక్ష్మి, శాంతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

క్వారీలపై రెండో విడత విచారణ



ఉప్పరపాలెం కొండవద్ద ఉమ్మడి తనిఖీలు చేపట్టిన అధికారులు

యడ్లపాడు:నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ బ్లాస్టింగ్ జరగడం వల్ల ఇళ్లకు పగుళ్లు, ఊరిజనానికి అనారోగ్యాలు వస్తున్నాయన్న స్థానికుల ఫిర్యాదుతో పలుశాఖల అధికారులు ఉప్పరపాలెం గ్రామంలో రెండోసారి విచారణ చేపట్టారు. ఈనెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నరసరావుపేట ఆర్డీవో మధులత గ్రామాన్ని సందర్శించి, మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో కలసి ఫిర్యాదు దారులతో చర్చ జరిపారు. ఆర్డీవో ఆదేశాలతో బుధవారం రెవెన్యూ / మైనింగ్ శాఖల బృందాలు సర్వే నంబర్ 240/10 పరిధిలో మళ్లీ పరిశీలన చేపట్టాయి.

ఈ ప్రాంతంలో మొత్తం 23 మందికి మెటల్ క్వారీ అనుమతులు మంజూరయ్యాయని, అందులో కేవలం నలుగురు మాత్రమే అన్ని నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ చేసుకుంటున్నారని విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. మిగిలిన క్వారీలన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరిపి, నివేదికను జిల్లా అధికారులకు నివేదిస్తామని అధికార బృందం స్పష్టం చేసింది. ఈ విచారణలో మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ కళ్యాణి, సర్వేయరు రవితేజ, రెవెన్యూ ఆర్ఐ సుబ్బారావు, సర్వేయరు గేరా సురేంద్రనాథ్, వీఆర్వో శివకోటేశ్వరరావు, ఏఎస్ఐ వెంగయ్య పాల్గొన్నారు.

పశువైద్యశాలను తనిఖీ చేసిన గోనుగుంట్ల



డాక్టర్ సాయి మహేష్‌రెడ్డిని అభినందిస్తున్న కోటేశ్వరరావు

రొంపిచర్ల: మండలంలోని కర్లకుంట గ్రామంలో బుధవారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యటించారు. గ్రామంలోని పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. పశువైద్యశాలలో అందుబాటులో ఉన్న ఔషధాలను, ఇతర సదుపాయాలను ఆయన పరిశీలించారు. గ్రామ రైతులతో పశువైద్యశాలలో అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మూగజీవాలైన పశువులకు సేవలు అందిస్తున్న డాక్టర్ సాయి మహేష్ రెడ్డిని, సిబ్బందిని అభినందించారు. పశువైద్యశాల అభివృద్ధికి సహకరిస్తూ, పక్కనే ఉన్న తన 7.5 సెంట్ల భూమిని విరాళంగా ప్రకటించిన దాత గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకట కిషోర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.